
# నీ చుట్టూ ఎందరో

-పి. అరుణా రవిశంకర్



27—4—83

రిక్షా దిగి గేట్లోనుంచి లోపలకు వస్తూంటే పిన్ని ఎదురుగానే కనిపించింది. నవ్వూ, నా భుజానికి తగిలించుకున్న బాగ్‌నూ చూస్తూ, "ఏమేవ్. ఇలా ప్రత్యక్షమయ్యావ్? ఏమిటి విశేషం?" అన్నది నవ్వుతూ.

నా చిరునవ్వే ఆమె ప్రశ్నకు జవాబు అయింది. ఏమని చెప్పను?

"మీ ఆయన కులాసాయేనా? ఒక్కదానివే వచ్చావేం?" అన్నది ముందు గదిలోకి వెళ్ళిన తర్వాత.

ఇక మాట్లాడక తప్పలేదు.

"ఆయనకు శెలవు లేదు" అన్నాను.

నా మొహంలోని భావాలను పిన్ని పసిగట్టిందేమోననే అనుమానం వచ్చింది. ఎందుకంటే అంతరంగంలోని ఆలోచనలను మొహం ఎంత వద్దనుకున్నా బయటపెడుతూనే ఉంటుంది.

బాబాయి ఇంట్లో లేడు. ఆఫీసుకు వెళ్ళిపోయాడు. వాచీకేసి చూసుకున్నాను. పదకొండు గంటలు దాటుతూంది.

నా ఎదురుగా కూర్చున్నది పిన్ని నా మొహంలోకే చూస్తూ— "ఏమిటి సంగతులు? అయినా, నీమొహం ఏమిటే అదోలా ఉంది!" నఅన్నది.

గతుక్కుమున్నాను.

నా ఉలికిపాటును పిన్ని గ్రహించింది.

చిరునవ్వుతో "ఏమయ్యింది,— రాజారావుతో గొడవపడ్డావా?" అని అడిగింది.

నా వూహ నిజమే అయ్యింది. పిన్ని చాలా తెలివయిన మనిషి. ఏ విషయాన్నయినా సులభంగా గ్రహించ గలదు. అయినా ఆమె అంటే నాకు చిన్నతనం నుంచీ బాగా ఇష్టం కాబట్టే, రాత్రి ఆయనతో ఒక చిన్నసైజు యుద్ధం జరిగిన తర్వాత మా ఇంటికి వెళ్ళకుండా పిన్ని దగ్గరకే వచ్చాను.

నేను మవునంగా కూర్చోవటం చూసి "సరే, ప్రయాణం చేసి వచ్చావ్. ఇప్పుడేమిన్నా బాధ పెట్టడం బావుండదు. స్నానం చేసి వచ్చేయి. భోజనాలు చేద్దాం" అన్నది లేచి నిల్చుంటూ.

తేలిగ్గా గాలి పీల్చుకున్నాను. ఆమె అడిగినా, అడగకపోయినా నా సమస్య పిన్నికి, బాబాయికి. చెప్పాలనే ఆ ఇంటికి నేను వచ్చినది.

లేచి బాగ్‌లో నుంచి చీర, జాకెట్టు బయటకు తీసి బాత్‌రూమ్‌కు వెళ్ళబోతున్నప్పుడు గేట్లో నుంచి ఒక యువకుడు లోపలకు వచ్చాడు. అతని చేతిలో ఏదో నవల ఉంది. పాతికేళ్ళు దాటి ఉండదు అతని వయసు.

"వరలక్ష్మిగారు లేరా?" అనడిగాడు నన్ను.

"ఉన్నది" అని పిన్నిని పిలిచాను.

"నువ్వా జనార్దన్!" అన్నది పిన్ని అతని చూసి

"ఇదిగో వీరాగు అడిగిన నవల— రేపు ఇచ్చేయండి. ఈ నవల చాలామంది అడుగుతున్నారట." అన్నాతడను చేతిలో ఉన్న పుస్తకాన్ని పిన్నికిచ్చి.

"సర్లే" అన్నది పిన్ని.

"ఫాన్ చెడిపోయిందన్నారుగాదా. ఇప్పుడు దాన్ని తీసుకెళ్ళి రిపేరు చేయించుకు రమ్మంటారా?" అనడిగాడు అతను.

"తీసుకెళ్ళు"

అతను ముందు గదిలో ఒక మూల ఉన్న టేబిల్ ఫాన్ తీసుకుని వెళిపోయాడు.

నే బాత్‌రూముకు వెళ్ళిపోయాను. స్నానం చేస్తున్నంతసేపూ రాత్రి నా భర్తతో నేను గొడవ పడిన విషయం గుర్తుకు వస్తూంది. తను మగవాడనే అహంకారం కాకపోతే మరేమిటి?

వచ్చేసరికి ఇద్దరికీ వడ్డించింది పిన్ని.

"రాణి దగ్గర్నుంచి ఉత్తరాలు వస్తున్నాయా?" అడిగాను పిన్నిని.

"నిన్ననే వచ్చింది. బాబు, అల్లుడు అంతా బాగానే ఉన్నారట. నీ బాబాయిని, నన్ను ఒకసారి రమ్మని రాసింది, అల్లుడు కూడా తప్పకుండా రమ్మని రాయమన్నాడట."

రాణి పిన్ని కూతురు. నాకంటే మూడేళ్ళు పెద్దది. మూడేళ్ల క్రితం రాణి పెళ్ళయింది.

భోజనాలు అయ్యాయి.

చాప వాల్చుకుని పడుకున్నాను.

"మంచం మీద పడుకో" అన్నది పిన్ని.

"ఫర్వాలేదులే" అన్నాను.




వంటిల్లు సర్దేసి ఆ వాలా తీసుకుని నా దగ్గరే కూర్చున్నది పిన్ని.

ఇక తప్పదు అనుకున్నాను.

ఎందుకో భయంగా ఉంది.

ఎగ్జామ్స్‌లో ఫెయిలయినా బావుండేదనిపించింది.

"ఇప్పుడు చెప్పవమ్మాయ్. ఏమిటీ నీ కథ?" అన్నది పిన్ని వక్కపొడి నములుతూ

ఆయన రూపం కళ్ళముందు కదిలింది. రాత్రి కోపంతో ఆయన్న కనులు ఎర్రబడటం, మీరు అన్యాయంతో కుళ్ళిపోతున్నారని నేనన్నప్పుడు ఆయన పిడికిళ్ళు బిగుసుకోవటం కూడా గుర్తుకు వచ్చింది.

"నాకు ఉద్యోగం వచ్చింది, పిన్నీ" అన్నాను ఎలా మొదలుపెట్టాలో తెలియక..

"ఎప్పుడు?" అడిగింది ఆశ్చర్యం గా

"రెండు రోజులయింది. నా పెళ్ళికి ముందే నేను సర్వీస్ కమిషన్ పరీక్ష రాశాను. అందులో నేను సెలక్టు అయ్యాను. మొన్ననే తెలుసొచ్చింది ఈ ఉద్యోగమే మా ఇద్దరి మధ్యనా పెద్ద దువ్వారాన్ని లేవదీసింది" అన్నాను.

"ఎలా?"

"నేను ఉద్యోగం చెయ్యటం ఆయనకు ఇష్టం లేదట. ఇప్పుడు నీకు ఉద్యోగం ఎందుకు? అంత అవసరం ఏమొచ్చింది? నా ఉద్యోగం చాలదా? మనం లేక దరిద్రంలో పడి కొట్టు కుంటున్నామా? అని నాతో వాదించాడు. కాని నేను వినలేదు. ఏమయినా సరే నన్ను ఉద్యోగాన్ని వదిలేయమని చెప్పాను. ఆయనకు కోపం వచ్చింది. నన్ను తిట్టాడు."

నా మాటలు విని పిన్ని నవ్వి "ఇదా మీ గొడవకు కారణం" అన్నది.

"అవును. నువ్వు చెప్పు, పిన్నీ! నెలకు ఆరు వందల రూపాయలు ఇచ్చే గవర్నమెంటు ఉద్యోగాన్ని ఎవరయినా వదులుకుంటారా? ఎంత ఆస్తి ఉన్నా డబ్బులు ఎక్కువ అవుతాయా?"

పిన్ని మాట్లాడలేదు.

మళ్ళీ నేనే అన్నాను—"ఆయన మనసును నేను గ్రహించాను. ఆయనకు జెలసీ ఎక్కువ. నేను కూడా ఉద్యోగం చేస్తే, నాకూ సంపాదన ఉంటుంది కాబట్టే ఆయన్ని లెక్క చెయ్యనని భయం. అందుకే ఆ భయం కొద్దీ, జెలసీ వల్ల నన్ను ఉద్యోగంలో చేరవద్దని శాసిస్తున్నాడు. మగవాడనే అహంకారం వల్లనే తను చెప్పినట్టు నడుచుకోవా లంటున్నాడు. నిజమే ఆయన సంపాదించే డబ్బుతో ఇద్దరం సుఖంగానే జరుగుతున్నాము. ఆయనకి ఆస్తి బాగానే ఉన్నది. నాన్న కూడా నా పేరున కొంత డబ్బు బాంకులో వేశాడు. ఎంత ఉంటే మాత్రమేం? వచ్చే డబ్బును పోగొట్టుకోవటం ఎందుకు? ఇవన్నీ ఆయనకు తెలీకకాదు. అన్నీ తెలిసే ఆయన ఇలా గొడవ పెట్టుకున్నాడు. అందుకే ఉదయమే ఇక్కడకు వచ్చేశాను."

పిన్ని మొహంలోకి చూస్తే ఏదో తీవ్రంగానే ఆలోచిస్తున్నట్టు అని పించింది.

కొంచెం సేపటి తరవాత "నన్నుసరిగా అర్థం చేసుకుంటానంటే ఈ విష యం గురించి నేను మాట్లాడతాను" అన్నది పిన్ని.

ఆశ్చర్యపోయాను.

"పిన్నీ" అన్నాను.

"అవును, చెప్పు."

"నిన్ను అర్థం చేసుకోకపోవ టంలో అర్థం లేదు."

"నా దృష్టిలో అవసరం వచ్చి నప్పుడే నలుగురులోకి వెళ్ళి ఉద్యోగం చెయ్యాలి. ఇప్పుడు నీ సంసారానికి అంత అవసరం ఏముంది? నువ్వు ఉద్యోగం చెయ్యక పోవటం వల్ల నీకు డబ్బు నష్టం తప్పించి మరే నష్టమూ లేదు. నువ్వు ఉద్యోగం చెయ్యటం మీ ఆయనకు ఇష్టం లేదు. ఆయనకు ఇష్టం లేని పని చెయ్యటం ఎందుకు? ఈ ఉద్యోగమే మీ ఇద్దరి మధ్య కల తలకు కారణం అయినప్పుడు నువ్వు ఇంత మొండిగా ఆలోచించవలసిన అవ సరమేముంది? నీ కాపురం కంటే ఈ ఉద్యోగం నీకు ముఖ్యమైనదంటావా? నువ్వనుకోవటమే గానీ భార్య మీద భర్తకు జెలసీ ఎప్పుడూ ఉండదు. నువ్వు అతని వైపు నుంచి కూడా ఆలోచించు" అన్నది సలహా ఇస్తూ.

పిన్ని అలా ఆయన్నే సమర్థిస్తూ మాట్లాడేసరికి నాకు కొంచెం బాధ అని పించింది. పిన్ని తప్పకుండా నన్నే సపోర్టు చేస్తుందని అనుకున్నాను. కాని నా ఊహ తప్పయ్యింది.

ఆయన వైపు కూడా ఆలో చించాలా?

ఏమని? ఆయన మనసులో ఆలో చనలను నేను ఎప్పుడో చదివాను.

ఆయనకు నా మీద ప్రేమ ఉన్నది. జెలసీ కూడా ఉన్నది. ఆయనతో

సహజంగా నేను కూడా అనుకున్నాను. నా తల్లిదండ్రులూ బాగా ఆస్తి ఉన్న వాళ్ళు. నా పేరున కొంత డబ్బు బాంకులో ఉన్నది. నా వంటి మీద నా పుట్టింటి వాళ్ళు పెట్టిన నగలూ, ఎన్నో ఖరీదయిన చీరలూ ఉన్నాయి.

అప్పుడప్పుడు మాటల్లో ఆయన నా పట్ల అసహాయ కనబరచటాన్ని నేను గమనించకపోలేదు.

ఆలోచనలతోనే నిద్రపోయాను.

సాయంత్రం నాలుగు గంటలకు నిద్ర లేచే సరికి పిన్ని వంట గదిలో ఉన్నది.

మొహం కడుక్కుని వచ్చాను.

పిన్ని టిఫెన్, కాఫీ ఇచ్చింది.

"ఆలోచించావా?" అన్నది నవ్వుతూ.

"ఏమో ఎలా ఆలోచించినా నా నిర్ణయం తప్పని నాకు అనిపించటం లేదు."

"తప్పని కాదు. సరయినది కాదు" అన్నది.

నాలుగున్నరకు అతను వచ్చాడు. ఫాను బాగు చేయించుకు వచ్చాడట పిన్ని డబ్బు లిచ్చింది.

వెళ్ళిపోయాడు.

ఐదున్నరకు బాబాయి వచ్చాడు. నన్ను నవ్వుతూ పలకరించాడు.

ఒక అరగంట గడచిన తరవాత పిన్ని నా గురించి బాబాయితో చెప్పింది.

"నువ్వు తప్పు పని చేశావు, సునీతా" అన్నాడు.

నేను మాట్లాడలేదు.

"అవును. నీకు ఉద్యోగం ఎందుకు? అసలు నాకో విషయం చెప్పు ఉద్యోగం సరదా కోసమా? డబ్బు కోసమా? నీకు సరదా కోసమయితే ఉద్యోగమే కాకుండా చాలా సరదాలున్నాయి కాలక్షేపం కావటానికి. డబ్బు కోసం అయితే నీకు ఆ అవసరం లేదు."

"అవసరం లేదని నెలకు ఆరు వందల రూపాయలు పోగొట్టుకుంటావా బాబాయ్."

"అవును పోగొట్టుకోవాలి" అని మాట్లాడటం ఆపి—"అడుగో అతన్ని చూడు" అన్నాడు.

చూశాను.

అతనే. పిన్నికి నవల తెచ్చి తరవాత ఫాను బాగు చేయించుకు వచ్చినతను. రిక్షాలో ఏవో సరుకులు తీసుకువచ్చి ఎదురింట్లోకి తీసుకు వెళుతున్నాడు.

"ఎవ రతను?" అడిగాను.

"ఒక నిరుద్యోగి. ఎన్నో కష్టాలుపడి ఎట్లాగో డిగ్రీ చదివాడు రెండేళ్ళ క్రితం. అప్పటి నించి ఉద్యోగం రాలేదు. సంసారం పెద్దది. తండ్రి సంపాదన చాలదు. అందుకే అతను ఇంటింటికి తిరిగి ఏవయినా చిల్లర పనులు ఉంటే చేసి పెడతాడు. రూపాయో, రెండో తీసుకుంటాడు. ఉదయం న్యూస్‌పేపర్ తెచ్చి పెడతాడు. డిగ్రీ చదివి ఇలాంటి పనులు చేసి అతను సంపాదిస్తున్నాడు కుటుంబం కోసం. నీకు వచ్చిన ఉద్యోగమే అతనికి వచ్చిందనుకో. అతనికి ఎంత సహాయంగా ఉంటుంది? అతను పడుతున్న బాధలకు ఉపశమనం అవుతుంది. అతనికి ఇప్పుడు ఉద్యోగం వస్తే ఎంతో సంతోషపడతాడో ఆలోచించావా? ఒక్క పూట కూడా కడుపునిండా తిండి తినలేని ఇలాంటి నిరుద్యోగులెంతమందో నీ చుట్టూ ఉన్నారు, సునీతా! ఇలాంటి వారి మధ్య నువ్వు సరదాగా ఆరువందల రూపాయల కోసం ఉద్యోగం చేస్తానంటావా?

ఈ దేశంలో బిచ్చగాళ్ళ కంటే నిరుద్యోగులే ఎక్కువ. నిరుద్యోగులను కించపరచటం కాదు. ప్రస్తుతం ఈ దేశంలో నిరుద్యోగం ఎలాంటి స్థితిలో ఉందో చెబుతున్నాను. నువ్వు ఈ ఉద్యోగంలో జాయిన్ కాలేదనుకో. ఆ ఉద్యోగం ఈ జనార్ధనం లాంటి ఒక నిరుద్యోగికి రావచ్చు. ఆలోచించు, అమ్మాయ్! నువ్వు ఉద్యోగం చెయ్యటం అవసరమంటావా? ఈ ఉద్యోగం కోసం నువ్వు అల్లుడి మాటను కాదని నీ కాపురంలో కలతలు తెచ్చుకుంటావా? నువ్వే ఆలోచించు."

బాబాయి మాటలు నాలో ఆలోచనలను రేకెత్తించాయి.

జనార్ధనం ఆ ఎదురింట్లో నించి గాస్ సిలెండర్ తీసుకుని బయటకు వస్తున్నాడు.

ఇప్పుడు నాకు బాగా అర్థమవుతూంది. నా నిర్ణయం తప్పే. ఉద్యోగం నా లాంటి మనుషులకు కాదు. జనార్ధనం లాంటి నిరుద్యోగులకు, ఏ ఆధారమూలేని మనుష్యులకు.

"ఏం సునీతా ఆలోచిస్తున్నావా?" అడిగాడు బాబాయి సిగరెట్టు వెలిగించుకోబోతూ.

"ఇంకా ఆలోచించటానికి ఏమీ లేదు బాబాయ్. నా నిర్ణయం సరయినది కాదు. నేను ఉద్యోగం చెయ్యదల్చుకోవటం లేదు. రేపు ఉదయమే మా ఇంటికి వెళ్ళిపోతాను." చిన్నగా అన్నాను.

పిన్ని నవ్వుతూంది నా వైపు చూస్తూ. ★

